# ప్రాప్తకాలజ్ఞుడు

వాస్తవంగా ఇందు శేఖరశాస్త్రి ఒక మాదిరిగా చదివే ఘటం. ఒక మాదిరిగా ఏం కర్మం? బాగానే చదువుతాడు. తప్పకుండా ప్యాసు కావలసినవాడు కూడా. అదీగాక ఇతర వ్యవహారాలేవీ అతనికి పట్టవు, అతని విషయాలు అతనికి తప్ప. కావాలని ఏ విషయాలలోనూ జోక్యం కలుగజేసుకోడు. ఒక వేళ అటువంటి గడ్డు సమస్య లేవైనా తనను ఎదుర్కొన్నా తుడుచుకుపోయే రకం.

ఇంటర్మీడియేటు ఫష్టు క్లాసు రావటం వల్లనే ఆనర్సు క్లాసులో సీటు దొరికింది. ఫష్టు క్లాసు రాకపోతే లాభంలేదు. నాకు ఆనర్సు చదువుదామని ఎంత అభిలాష ఉన్నా అది అలా చచ్చిపోవలసిందే. ఎందుచేతనంటే ఇంటర్మీడియేటులో నా కర్మ అలా కాలింది కనుక. అసలు శాస్త్రి చదువుతాడు, తప్పకుండా ప్యాసవుతాడనుకొనే ఇంటి దగ్గరవాళ్లు కొన్ని వందల మైళ్లు పంపించారు అతనిని.

ఇందుశేఖరశాస్త్రి మొట్టమొదటగా కాలేజీలో అడుగుపెట్టాడు. పెదవి విరిచాడు. ఎందుకో అతనికే అర్థం కాలేదు. ఆ పెద్దపెద్ద బిల్డింగులు, అడవిలా పెరిగిపోయిన చెట్లు, చుట్టూరా కొండలు – అన్నీ ఒక్కసారి తనవంక గుడ్లురిమి చూస్తున్నట్లనిపించింది. ఇక్కడ మూడు సంవత్సరాలుండాలి కాబోలు. గుండె అతివేగంగా కొట్టుకోసాగింది. తను ముసుపు చదివిన కాలేజీ గుర్తుకొచ్చింది. సముద్రపు అరుపులు వినాలి కాబోలు మూడు సంవత్సరాలు, ప్రతిరోజు, ప్రతి నిముషం కూడా! ఇక్కడ ఊరికే ఉండటమైతే ఎన్ని సంవత్సరాలైనా ఉండవచ్చు. కాని చదవాలి గదా ప్రాణంపోయేలా.

అనుమానిస్తూనే కాలేజీలో చేరాడు. అన్నీ క్రొత్తపరిస్థితులు. అంతా క్రొత్త




వాతావరణం. ఏమిచేయాలన్నా తోచటం లేదు. బజారుకు పోదామంటే అది ఒక ఊరుకూడా కాదు. లైబ్రరీ ఉన్నదిగదా అనుకొని పోయాడు. ఆ పుస్తకాలు, బీరువాలు, దానిలో పనిచేసే మనుష్యులు, వాటన్నిటినీ చూసేసరికి శాస్త్రి కలవరపడ్డాడు. వెంటనే బయటకు వెళ్లిపోదా

మనిపించింది. కాని కాస్త పేపరు చూదామనే ఉద్దేశ్యంతో కూర్చుని, మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చినవాడు సాయంత్రం అయిదు గంటలవరకు ఉండిపోయాడు.

రూముకు పోయాడు. మమ్మల్ని ఇక్కడకు తెచ్చి పడవేశావేమన్నట్లు చూస్తున్నయ్ రేక్ లోపలి పుస్తకాలు. చెప్పులు విడిచి కూర్చున్నాడు కుర్చీలో రెండు చేతుల మధ్యా తల ఇరికించుకొని. నేనే కొండరాళ్లలో నడవలేనన్నట్లుగా ఉన్నదా చెప్పులజత.

మెల్లగా లేచి భోజనానికి పోయాడు. అబ్బె! వెధవ భోజనం అన్నం తింటున్నంతసేపు, ఇంటిదగ్గర భోజనం గుర్తుకు వస్తూనేఉన్నది. ఇటువంటి అన్నం తింటూ మూడు సంవత్సరాలు బ్రతకాలి. పైగా రేషనింగు. వీళ్ళందరూ ఈఅన్నం తిని ఎలా జీవించగలుగుతున్నారూ? అని తన్ను తానే ప్రశ్నించుకొన్నాడు. ఇతరులను ప్రశ్నిస్తే వచ్చే సమాధానం అతనికి తెలుసు గనుక.

ఆరాత్రి ఆవిధంగా ఆలోచిస్తూనే నిద్రపోయాడు. ప్రొద్దున్నే లేచాడు. కాలకృత్యాలు తీర్చుకోవాలన్న విషయం

# "అమరశ్రీ"

మాత్రం అతను మర్చిపోలేదు. స్నానాల గదిదగ్గరకు పోయాడు. ఒక్కొక్క బాత్ రూమ్ ముందు పాతిక సబ్బుపెట్టెలున్నయ్. వెధవ క్యూ. స్నానంచేసే చోటకూడ 'క్యూ' యే. తన ఇంటిదగ్గర విషయం వెంటనే గుర్తుకొచ్చింది. రోజూ, ప్రొద్దునా సాయంకాలం కూడా అను ఇరవై బిందెల నీళ్లు పోసుకొనేవాడు. ఇక ఆఆట సాగదు. అంతవరకూ ఎందుకు? స్నానం లేకుండా ఎన్ని రోజులు గడపాలో? ఏ విషయం కూడ నచ్చలేదు ఇందుశేఖరశాస్త్రికి. ఆ విధంగా ఆలోచిస్తూనే బాత్ రూమ్ ముందర కూర్చున్నాడు. లోపలనుంచి బయటకు వస్తున్నారు. బయటనుంచి లోపలకు పోతున్నారు.

ఎనిమిదిన్నరయినా కూడ తనవంతు వచ్చేలా కనుపించలేదు. పైగా తొమ్మిది గంటలకు నీళ్లు కట్టివేయటం కూడా జరుగుతుందట. కాళ్లు పీక్కుపోతున్నయ్. మరోనాలుగు కట్టించకూడదూ? వాళ్ల సొమ్మేం పోయింది? 'ఎస్టాబ్లిష్ మెంట్' ఛార్జి కాజేస్తున్నారుగా.

అసలే బాధగా ఉంది. బాత్ రూముల నుంచి వినవచ్చే పాటలు శాస్త్రిని మరీ చికాకు పరుస్తున్నయ్. లోపలకు పోయిన వాళ్లు మెల్లగా స్నానం చేసిరాక, ఏదో జీవితంలో పెద్దదానిని సాధించినట్లుగా ఫీలయి, ఈలపాటలు జోలపాటలు పాడుతుంటే ఇందుశేఖరశాస్త్రికి తలకాయ నొప్పి మరీ హెచ్చింది. కనీసం అమృతాంజనండబ్బాలన్నా దొరకవు కొనుక్కోటానికి. గుండుసూది కొనాలన్నా నాలుగు మైళ్లు పరుగెత్తాలన్న విషయం ఇందుశేఖరశాస్త్రికి అదివరకే తెలుసు.

“బ్రతుకలేనే నినూ బాసీ ప్రేయసీ” అంటున్నాడు బాత్ రూములోనుంచీ ఒక పురుషుడు. మరోదానిలోనుంచీ “ఓ దూర్ జానేవాలే” పెద్దగా వినిపిస్తోంది. స్నానం లేకపోతే పోయింది. లేచి రూముకు పోదామనుకున్నాడు ఇందుశేఖరశాస్త్రి. కాని రోజుకు మూడు నాలుగుసార్లు స్నానంచేసే ప్రాణిగా మరి! 'ఈ ప్రేమ' అన్నేది, ప్రపంచంలో ఉన్న జీవులందరకూ' ఎప్పుడూ, ప్రతిచోటా కూడ ఎందుకు పట్టుకుంటుందో అర్థం కాలేదు నేటివరకూ శాస్త్రికి. ఇకముందైనా అర్థమవుతుందన్న ఆశకూడ లేదు. మరోక రూమునుంచీ “యే జిందగీకె మేలా” ఖంగున మ్రోగుతూంది. స్నానం చేయగలగటంకూడ ఏరోజు కారోజు అదృష్టంక్రింద మారింది.

ఇటువంటి విషయాలెన్నో ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఎనిమిది గంటలయింది. నీళ్లు రావటంలేదు. ఆవురుమని ఒక్కసారి ఏడుద్దామనుకున్నాడు శాస్త్రి. అంతగా బాధపడ్డాడు పాపం. ప్రొద్దున లేచినప్పటి నుంచి కావలి కాస్తేనే దిక్కులేదు. ఇక ప్రతిరోజు స్నానంచేసే దెలాగూ అర్థం కాలేదు. నిజానికి తనకు రావటానికి ఫస్టు కానే వచ్చింది.



మెల్లగా సబ్బుపెట్టె, అర్ధరూపాయి పెట్టి కొన్న డబ్బా పట్టుకొని రూముకేసి నడిచాడు. గుడ్డలు మార్చుకొని బయటపడే సరికి ఎనిమిదిన్న రయింది. 'మెస్' వైపు నడిచాడు కాఫీ అన్నా ఇస్తారేమోనన్న ఆశతో. కాని ఇస్తారనే నమ్మకం మాత్రం లేదు. అనుకున్నంత పనీ జరిగింది. 'కాఫీలేదు' అన్నాడు అయ్యర్ మర్యాదగా. మళ్లా రూముదారి పట్టాము.

ఇందుశేఖరశాస్త్రికి ఇప్పుడొక పెద్ద సందేహం కలిగింది? ఇటువంటి కూళ్లలో జీవిస్తూ చదవటం ఎలాగు? ఏ మాత్రమూ చదువు సాగదు. కాబట్టి టి. సి. తీసుకొని ఇంటికి నడవటం మంచిది. లక్షణంగా బి.ఏ. చదువుకొని ప్రాప్తముంటే ఎమ్.ఏ.కు మరో యూనివర్సిటీకి పోవటం మంచిదనుకున్నాడు. హోల్డాలు చుట్టివేశాడు. పెట్టెకూన సర్దిపారేశాడు. కాని పోతే ఏం జరుగుతుంది? వెధవ ప్రశ్న! ఇటువంటివే వెలుగుతుంటయ్ ఇందుశేఖరశాస్త్రికి ఎప్పుడూ కూడ. 'లాజిక్'లో ఏమాత్రం ప్రవేశం లేకపోయినప్పటికీ, ఇస్త్రీకి వేసిన గుడ్డలు ఉతకనివ్వకుండానే డబ్బులిచ్చుకుంటూ తిరిగి తీసుకొని పెట్టెలో కుక్కాడు.

టి. సి. తీసుకోవటం ఒక్కటే మిగిలిపోయింది. ఆఫీసుకు బయలుదేరాడు. 'క్లర్కు' అడిగాడు వెళ్లిపోవటానికి కారణమేమిటని. ఏదో కారణం కల్పించాడు శాస్త్రి "మళ్లీవస్తే చేర్చుకోరు" అన్నాడు 'క్లర్కు'. "మళ్లా ఎవడు రాబోయాడోయ్" అని మనసులో అనుకుంటూనే తల ఊపాడు. "ప్రిన్సిపాలుగారు వచ్చిన తరువాత ఇస్తాము" అన్నాడు. శాస్త్రి తెల్లబోయాడు.

మధ్యాహ్నం మెయిలుకు వెళ్లిపోదామనుకున్నాడు. కాని పోనిచ్చేలా కనిపించలేదు. టి. సి. కావాలంటూ ఒక అప్లికేషను వ్రాసి 'క్లర్కు'కిచ్చి ప్రిన్సిపాలు వచ్చిన తరువాత మాట్లాడి కాగితాలన్నిటినీ సిద్ధంగా ఉంచమని మరిమరీ ప్రాధేయపడి భోజనానికి బయలుదేరాడు. అదే చివరిసారి భోజనమనుకుంటూ ముగించుకొని మళ్లా ఆఫీసుకు వచ్చాడు.

ప్రిన్సిపాల్‌గారు రాలేదు. అసలు వస్తారా? ఎవడు చెప్పగలడా విషయం. రోజూ మామూలుగా వస్తూఉంటారా? ఎవడూ చెప్పలేరు వస్తుంటాడో, లేదో. పోనీ ఈ ఒక్కపూట క్లాసుకు పోదామని పోయి కూర్చున్నాడు. అప్పటికే మరొక పెద్దమనిషి కూర్చున్నాడు. ఆనర్సు ఇంగ్లీషువాళ్లు ఇంతే కాబోలు ననుకొని తనుకూడ చదికిలబడ్డాడు. గంట కొట్టారు. ప్రొఫెసర్ వచ్చాడు. మరోవైపునుంచీ నలుగురు లేడీ స్టూడెంట్స్ వచ్చారు. శాస్త్రికి ముచ్చెమటలు పోసినయ్. ఆనర్సు ఇంగ్లీషు క్లాసులో నలుగురు ఆడవాళ్లు ఇద్దరు మొగవాళ్లు అని తెలిసిన తరువాత శాస్త్రికసలు అక్కడ కూర్చో బుద్ధిపుట్టలేదు.

ప్రొఫెసర్ ఏదో చెప్పుకుపోతున్నాడు. శాస్త్రి తన ఆలోచనలో తను పడిపోయాడు. ఆలోచనాశక్తి ఎక్కువగా ఉన్న మానవులు జీవితంలో ఎక్కువ బాధలపాలు కావాలి. శాస్త్రికి మాత్రం ఇటువంటివేమీ వినపడవు.

ఒక్కొకపుడు శాస్త్రికి చాల వింతవింత ఆలోచనలు కలుగుతయ్. ఆ 'లేడీ స్టూడెంట్స్'ను చూడగానే 'ఇదంతా సమానత్వం కాబోలు' ననుకున్నాడు శాస్త్రి. పార్కుల్లో, క్లబ్బుల్లో, కాలేజీలలో ఉద్యోగాలలో స్త్రీకి పురుషుడికున్నంత ప్రాతినిధ్యమూ ఉండాలి. బాగానే ఉన్నది అంతవరకు. కాని శాస్త్రికి పెద్దపెద్ద అనుమానాలు కలగటం మామూలు. పార్కులు చాల ఊళ్లలో స్త్రీల కొకరోజు ప్రత్యేకించబడతయ్. ఆ రోజు స్త్రీలు తప్ప మరెవరూ పార్కులో అడుగు పెట్టటానికి వీల్లేదు. కాని వారంలో మిగిలినరోజులలో స్త్రీలు రాగలిగితే రావచ్చు. చాల పట్టణాలలో కూడా ప్రస్తుతం అమలులో ఉన్న ఆచారం ఇది. స్త్రీలు అన్నిరోజులూ పార్కులో తిరగవచ్చు. కాని స్త్రీలకు ప్రత్యేకించబడిన రోజున మాత్రం పురుషుడు వెళ్లటానికి వీల్లేదు. దానిలో 'సమానత్వం' అనేది ఎంతవరకూ ఉన్నదో శాస్త్రి సులభంగా గ్రహించగలిగాడు. ఈ సమాజం, ఇరవైయవశతాబ్దపు సమాజం, ఇటువంటి 'సమానత్వాల'తో నిండిక కుళ్లుతో ఉండికూడ, ఇదంతా 'నాగరికత'ని ఏ విధంగా అంటుందో బోధపడలేదు శాస్త్రికి. ప్రతి విషయంలో కూడ ఇటువంటి అవకతవకలే. కాగా ఇది కూడ ఒక నాగరికతేనని రొమ్ము విరిచి చెప్పుకుంటారు, అందులో ఎక్కువగా ఆంధ్రవీరులు.

ప్రొఫెసరు అంతా చెప్పేసి, 'ఇప్పుడు నేను చెప్పినదంతా ఉపోద్ఘాతము'న్నాడు. శాస్త్రికి మరీ భయం పుట్టింది. "ఈ ఉపోద్ఘాతమే బంగాళాఖాతమంత ఉన్నదే.." తరువాత ఆలోచనకూడ పుట్టలేదు శాస్త్రికి.

గంటకొట్టారు. బయట పడదామనుకుంటున్నాడు. "ఏమండోయ్" అని పిలిచారు వెనకనుంచి ఎవరో. ఆ నలుగురిలో ఒకామె దగ్గరగా వచ్చింది. శాస్త్రి ఆశ్చర్యానికి అంతులేదు. "పుస్తకాలేం కొనాలో వ్రాసుకుంటే ఒక్కసారి ఇస్తారూ. వ్రాసుకొని రేపు తిరిగి ఇస్తాము" అన్నదామె. "లేదండీ వ్రాసుకోలేదు. అన్నాడు శాస్త్రి" తన ప్రక్కన అంతవరకూ కూర్చున్న సోదరుడు ప్రారంభించాడు మళ్లా. ఈమధ్య బయటపడ్డాడు శాస్త్రి. ఇదంతా ఒక క్రొత్తప్రపంచంలా కనుపిస్తోంది, శాస్త్రికి. చాల అగమ్యగోచరంగా ఉన్నది ఈ లోకమంతా. అంత తలనొప్పితో 'క్లర్కు'ను చేరుకున్నాడు. ప్రిన్సిపాల్ అప్పటికే వచ్చాడు కాని 'క్లర్కు' మాత్రం తన విషయం చూడలేదు. "దేవుడు వరమిచ్చినా పూజారి ఇవ్వ"డన్న


# గానకళా బోధిని

వెలువడినది! అపూర్వ సంగీతగ్రంథము వెలువడినది!

By Mr. & Mrs. N. C. Parthasarathy

సంగీతమును ప్రారంభమునుండి రాగాలాపనలు, కల్పనస్వరముల వరకు నేర్చుకొనవారికిని, లోయర్, హైయ్యర్ గ్రేడ్ పరీక్షలకు పోవు విద్యార్థులకు శాస్త్రము. ప్రాక్టికల్ గ్రాపులతోను పథకములతోను విపులముగా వ్రాయబడినది. $8\frac{1}{2} \times 5\frac{1}{2}$ (డెమ్మి 1/8) సైజులో 750 పేజిలు గల పుస్తకము. గ్లేజు కాగితముపై ముద్రింపబడిన పూర్తి క్యాలికో బైండు పుస్తకము వెల రు 10/-లు. పోస్టేజి ప్రత్యేకము. అడ్వాన్సుతోపాటు అర్డరు పంపేది.

**బాలసరస్వతీ బుక్ డిపో**, పి. బి. నెం. 3, కర్నూలు.

మరియు

వెంకటరాం అండ్ కో, పబ్లిషర్సు అండ్ బుక్ సెలర్సు,

అన్ని బ్రాంచీలలోను, హిగిన్‌బాదమ్సు అన్ని స్టాల్సులోను దొరకును.

ట్లుగా ఉన్నది ఈ విషయం చూస్తుంటే.

"ఏమండీ నా విషయం" అన్నాడు శాస్త్రి వినయంగా. "ఇదుగో, ఇప్పుడే నీ విషయం అనుకుంటున్నానండీ. పోయొస్తాను." అంటూనే నా అప్లికేషన్ చేతబట్టుకొని పోయాడు. ఆ పది నిముషాలు శాస్త్రి నానా అవస్థలూ పడ్డాడు. ప్రిన్సిపాల్ ఎక్కడ పిలుస్తాడో, ఏమని అడుగుతాడో ఏమి సమాధానమివ్వాలో, ఎలా మాట్లాడితే టి. సి. సంపాదించగలుగుతామో అనుకుంటుండగానే 'క్లర్కు' తిరిగివచ్చాడు. శాస్త్రి మాట్లాడకుండానే ప్రిన్సిపాల్ గది దగ్గరనుంచిఆయనకుర్చీవరకుఅనుసరించాడు.

'టి. సి.' 'కాన్డక్టు సర్టిఫికెట్' అన్నీ వ్రాసిస్తూ మళ్ళొవస్తే చేర్చుకోమని చెప్పమని చెప్పాడు' అన్నాడు క్లర్కు. "మళ్లా ఈ వెధవ నరకంలోకి చస్తే వస్తానా?" అందామనుకున్నాడు. కాని వాటిని తీసుకున్న సంతోషంలో మునిగిపోయి మాట్లాడకుండానే సామానుతోపాటు స్టేషన్ చేరుకున్నాడు.

స్టేషన్ చేరుకున్నప్పటినుంచీ శాస్త్రి మనస్సు క్రమక్రమంగా మారసాగింది. ఛా చదువుదామని, అందరిలోనూ గొప్పగా కనుపించాలనే ఉద్దేశ్యాలతో వచ్చి తిరిగి పోవటమేమిటి? అర్థం ఉన్నదా ఏమైనా? తోచటంలేదు. ఇప్పుడేమనుకుంటే ఏం లాభం? మొదట్లోనే ఉండాలి, ఈమనస్సు. అంతా గతించినతరువాత ఏమనుకొంటే ఏమున్నది? పోనీలే, మనకీ చదువు ప్రాప్తం లేదు. లక్షణంగా బి. ఏ., చదువుకొని ఎమ్. ఏ. కు మద్రాసు యూనివర్సిటీకి పోవచ్చుననుకొని తన్ను తాను ఊరడించుకొన్నాడు.

బండి వచ్చింది. రైల్వేకూలీ వచ్చాడు. సామాను లోపల పడవేశాడు! తనుకూడ సామానులానే, సామానుప్రక్కనే కూలబడ్డాడు. సిగ్నలు ఇచ్చారు కాబోలు ఇంజను కూసింది ప్రాణమున్న జంతువులా. గార్డు జండా ఊపాడు. అటువంటపుడు బండి కదలక మానుతుందా?

ఇంతలో ఎవరో ఒకాయన పరుగెత్తుకుంటూ గేటులో నిలబడ్డ టికెట్ కలెక్టర్ ఆపుతున్నకొద్దీ, బండిలో మనుష్యులు అరుస్తున్నకొద్దీ వినకుండా బండి ఎక్కబోయాడు. కాని ఎక్కలేకపోయాడు. లోపలివాళ్లు పెద్దగా అరుపులు ప్రారంభించారు. అప్పటికీ ఊరుకోలేదు. వేగం హెచ్చిన తరువాతకూడ. ఎలాగైతేనేం? ఎక్కాడు ఆడవాళ్ల పెట్టెలో.

వెంటనే బండి ఆగిపోయింది. పాపం! అతనిని, దించి, నానాతిట్లూ తిట్టారు. ఆడవాళ్ల పెట్టెలోకి ఎక్కగూడదుట. అసలు బండి కదిలినతరువాత బండి ఎక్క ప్రయత్నించటమే తప్పు. అందులో ఆడవాళ్ల పెట్టెలో ఎక్కటమంత నేరం సహించరానిది, క్షమించరానిది కూడ. "నీకు ఆడవాళ్ళు లేరూ? తోబుట్టువులు లేరా? అని ప్రశ్నించారు, కొందరతనిని. ఇంతలో గార్డు, వాళ్లందరూ వచ్చి ఏవేవో మాటలన్నారు. అతి నెటువంటివాడో వీళ్లకేం తెలుసు.

అసలు ఏది న్యాయం? ఏది సభ్యత? ఆడవాళ్ల పెట్టెలోకి మగవాడు ప్రమాదవశాత్తునైనా ఎక్కగూడదు. కాని మగవాళ్ల పెట్టెలోకి ఆడవాళ్ళు, ఇష్టంవచ్చినప్పుడు, ఇష్టం వచ్చినట్లు దూరవచ్చు. కాని పురుషుడు మాత్రం ఆ పని చేయగూడదు. అదొక క్షమించరాని నేరం. ఇదే సమానత్వం. ఇదే సభ్యత. ఇదే అభివృద్ధి చెంది పూలు పూసి, కాయలు కాస్తున్న మన నాగరికతాచిహ్నం.

అందుచేతనే శాస్త్రి మాట్లాడకుండా కూర్చున్నాడు. తన విషయాన్నే తను సరిదిద్దుకోలేని పరిస్థితిలో ఉన్నాడు. కాని తను రేపు తన ఊరు జేరుకున్నమీదట ఏం చేయాలో ఆలోచిస్తున్నాడు శాస్త్రి. తండ్రి ఎదురువస్తే ఏం చెప్పాల? తల్లి నెలా సమాధానపరచాలి? స్నేహితులేమంటారు? తన నింతవరకు ఒక వ్యక్తిగా పరిగణించేవారేమంటారు? వీళ్లందరకూ ఏమని సమాధానం చెప్పాలి? తను వచ్చినందుకు ఏం కారణం చూపాలి? పైన పండుకొన్నవాడు కాస్తా లేచికూర్చున్నాడు.

మరునాడు ఇల్లు జేరుకున్నాడు. ఎవరితోనూ ఏమీ మాట్లాడలేదు. తండ్రి ఊళ్లో లేడు. ఊరికే 'వచ్చానని' చెప్పి తల్లినుంచి తప్పించుకున్నాడు. కాలేజీలో ఉన్నపుడు రావటానికి ఎంతగా ఆరాటపడ్డాడో అంతగా ఆరాటపడుతున్నాడు మళ్ళీ పోవటానికి. కాని "మళ్ళా వస్తే చేర్చుకోమని చెప్పమన్నాడని" 'క్లర్కు' చెప్పిన మాటలు శాస్త్రి చెవులలో గింగురుమంటూనే ఉన్నయ్.

ఆ పరిస్థితులలో మళ్లా మూటా ముల్లె సర్దుకొని బయల్దేరాడు. ఈసారి మళ్ళీ చేర్చుకుంటారా? చేర్చుకోరనుకుంటూనే బయలుదేరాడు. ఒక పని కాదనుకుంటూ కూడా దానినే సాధించటంకోసం బయలుదేరేవారిలో శాస్త్రి కూడ ఒకడు.

శాస్త్రి నిజానికి తెలివిగలవాడే. అందుచేతనే ఇంటర్మీడియెటులో ఫస్టు క్లాసు వచ్చింది. ప్రిన్సిపాల్ గారింటికీ, ప్రొఫెసర్ గారింటికీ తిరిగి, మళ్లా సీటు సంపాదించుకోగలిగాడు. హాస్టల్లో సీటుకోసమని వార్డెనుగారింటిచుట్టూ తిరిగాడు విసుగుపుట్టినా కూడా లెక్కచేయకుండా.

కాలేజీలో జేరాడు ఎలాగైతేనేం, చావు దప్పి కన్ను లొట్టపోయి. మన వాడి తెలివితేటలు చూసి వాళ్ళందరు శాస్త్రిని హాస్టల్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. విద్యార్థుల తరఫున సంవత్సరమంతా హోరాహోరీగా పోరాడాడు. వార్డెనుకు శాస్త్రి అంటే గొంతువరకూ ఉన్నది. విద్యార్థులపట్ల అంత భక్తిశ్రద్ధలు కనుపరచినందుకు మరుసటిసంవత్సరం 'కాలేజీ విద్యార్థి యూనియన్' సెక్రటరీగా ఎన్నుకున్నారు. ఈసారి ప్రొఫెసరుగారితో దెబ్బలాడాడు. విద్యార్థులందరూ శాస్త్రికి బ్రహ్మరథం పట్టారు. విద్యార్థుల హక్కులకోసం పోరాడిన వీరుల 'లిస్టు'లో శాస్త్రి పేరు కూడా జేరింది.

అదిచూసి మరుసటి సంవత్సరం శాస్త్రిని 'ప్రెసిడెంట్' చేశారు. 'ఎలక్షన్'లో గెలిచాడు. 'ఎలక్షన్ మానిఫెస్టో'లో వ్రాసిన ప్రకారం రాత్రిపూట లైబ్రరీ తెరిపించాలని ఆందోళనచేసి తెరిపించాడు. ఇలాటివి ఎన్నో చేశాడు. ప్రొఫెసర్లతో ఎంతగా పోరాడాడో, అంత గౌరవాన్ని సంపాదించగలిగాడు విద్యార్థులలో. దీనికంతకూ తన తెలివే కారణం. అందుచేతనే అద్భుతంగా వ్రాశాననుకున్నాడు. వ్రాశాడు కూడా.

ఫస్టు క్లాసు వస్తుందనుకుంటూ ఇంటికి పోయాడు. ఎన్నో కలలుకన్నాడు. నిద్రపోతుంటే ఎవడో స్నేహితుడు వచ్చి 'రిజల్ట్సు' వచ్చాయని చెప్పి లేపాడు. కళ్ళు నులుముకుంటూ పోయి 'హిందూ' చూశాడు. నంబరు లేదు ఫస్టు క్లాసులో. మెయిలులో బాగా ఉంటాయని అనుకొని చూశాడు. 'రికమెండెడ్' బి. ఏ. ఇచ్చారు తనకు. ఒక్క పిచ్చినవ్వు నవ్వాడు! శాస్త్రి దీనికంతకూ ఒక్క తన తెలివితేటలే కారణమని గ్రహించగలిగాడు శాస్త్రి ఆ సమయంలో.

ఒక్కసారి ఆకాశంవంక చూశాడు. సూర్యుడివైపు చూశాడు. సముద్రంకేసి మరోసారి చూశాడు. చంద్రుడిలోకి చూశాడు. వీటి ముందు ఆ డిగ్రీ ఎంత? వీళ్ళ డిగ్రీలు కాదుగా తన విజ్ఞానానికి కొలతబద్దలు. ఈ డిగ్రీలు ప్రొఫెసర్లకీ మనకీ మధ్య ఉన్న సంబంధాన్ని మాత్రం తెలియజేస్తాయనుకుంటూ ఒక పిచ్చినవ్వు నవ్వుకున్నాడు. ఇంకా నవ్వుతూనే ఉన్నాడు కూడా. ★